క్లుప్తంగా

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


క్విజ్ పోటీల్లో విజేతలకు సైకిళ్లు అందజేస్తున్న డీఈఓ రమేష్

కోటనందూరు: కాకినాడలో జరిగిన రిలయన్స్ ధీరూభాయ్ అంబానీ క్విజ్‌పోటీల్లో స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కోటనందూరు హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు అవినాష్, పూర్ణిమ ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి తృతీయస్థానం సాధించారు. విజేతలకు జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ చేతుల మీదుగా సైకిల్, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. విజేతలను పాఠశాల హెచ్‌ఎం వేణుగోపాల్, అధ్యాపక బృందం అభినందించారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

రౌతులపూడి: మండల పరిధిలోని గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారం కోసం మంగళవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ పోతురాజు ఆదివారం తెలిపారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం మూడు గంటలు వరకూ ఈ సదస్సులు జరుగుతాయన్నారు. మంగళవారం నుంచి గురువారం వరకు రాఘవపట్నం సచివాలయంలో, 13న ఎస్.పైడిపాల, 17న గుమ్మరేగుల, 18న గంగవరం, రాజవరం, 20న ములగపూడి, బలరామపురం, 21న ఎస్ఎన్ పట్నం, లచ్చిరెడ్డిపాలెం, 24న పి.చామవరం, శృంగవరం, 26న పారుపాక, ఎస్.అగ్రహారం, 27న గిడజాం, ఎ.మల్లవరం, 28న రౌతులపూడి-1, రౌతులపూడి-2 సచివాలయాల్లో సదస్సులు నిర్వహిస్తామని వివరించారు. ఆయా గ్రామాల ప్రజలు, రైతులు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం


జి.కొత్తపల్లిలో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ కార్మికులు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని జి.కొత్తపల్లి సర్పంచ్ ఈగల విజయదుర్గ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీత తీయించారు. గ్రామం నలుమూలల బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లో బ్లీచింగ్ వేసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఈగల విజయదుర్గ మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

సారాబట్టీలపై దాడులు

ప్రత్తిపాడు: మండలంలోని లంపకలోవ గ్రామంలో సారా బట్టీలపై ఆదివారం ప్రత్తిపాడు ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 400 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై పున్నం వంశీరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఐక్య క్రిస్మస్ వేడుకలు


రావికంపాడులో దివాకర్‌ను సన్మానిస్తున్న పాస్టర్లు

తొండంగి: మండలంలోని రావికంపాడులో ఆదివారం ఐక్య క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ప్రపంచశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ యు.దివాకర్‌ను పాస్టర్లు శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీఎఫ్ నాయకులు విక్టర్ ఇమ్మానుయేలు, సీహెచ్ ప్రసాద్, యు.పాల్సన్, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

యువతకు సత్ప్రవర్తనపై అవగాహన

జగ్గంపేట: స్థానిక హైస్కూల్, డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో యువకులకు మంచి ప్రవర్తనపై సీఐ వైఆర్కే శ్రీనివాస్ ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు మార్గాలకు వెళ్లకుండా సన్మార్గంలో నడుచుకోవాలన్నారు. బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. మద్యం, మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దని సూచించారు.

చివరి గింజలకు పాట్లు

- తుపానుకు తడిసిన వరిచేలు
- తెరిపినిచ్చిన వాతావరణం
- పంట ఒబ్బిడిలో అన్నదాతలు బిజీబిజీ


తడిసిన వరిపంటను నూర్పిడి చేసేందుకు రోడ్డుపైకి మోసుకొస్తున్న కూలీలు

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పనలపై వరి పంట తడిసిపోయింది. తుపాను కారణంగా రైతులు కోతలను వాయిదా వేశారు. నాలుగు రోజులుగా వాతావరణం తెరిపిచ్చింది. దీంతో రైతులు పనలపై తడిసిన పంటను ఒబ్బిడి చేసుకునేందుకు ఆపసోపాలు పడుతున్నారు. ఇంతలోనే బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడింది. దీని ప్రభావంతో వాతావరణం మళ్లీ మాగుడుగా మారడంతో రైతుల్లో కంగారు మొదలైంది.

18 వేల ఎకరాల్లో..

తొండంగి మండలంలో ఈ ఏడాది సుమారు 18 వేల ఎకరాల్లో రైతులు ఖరీఫ్ వరిసాగు చేశారు. వ్యవసాయ బోర్లు పరిధిలో ముందుగా పంట పక్వానికి రావడంతో ఆయా ప్రాంతాల రైతులు వరికోత యంత్రాలతో కోత కోయించి పంటలను ఒబ్బిడి చేసుకున్నారు. పీబీసీ, పంపా ఆయకట్టు ప్రాంతాల్లో ఆలస్యంగా వరినాట్లు పడ్డాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఆ పంటలన్నీ కోత దశకు వచ్చాయి. ఇటీవల కోతలు ప్రారంభించిన రైతులు ఫెంగల్ తుపాను కారణంగా కొంత మంది కోతలు వాయిదా వేసుకున్నారు. ఎ.కొత్తపల్లి, బెండపూడి, పి.ఇ.చిన్నాయపాలెం, శృంగవృక్షం, పి.అగ్రహారం, రావికంపాడు తదితర ప్రాంతాల్లో సంప్రదాయ పద్ధతిలో కూలీలతో వరిపంటను కోత కోయించారు. కూలీల కొరత కారణంగా సకాలంలో పంట ఒబ్బిడి కాలేదు. కోసి పనలపై ఉన్న వరి పంట తుపాను ప్రభావంతో కురిసిన వర్షానికి తడిసింది. తడిసిన పనలను రైతులు ఆరబెట్టుకుని ఒబ్బిడి చేసుకుంటున్నారు.

కౌలు రైతులు విలవిల

కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. అప్పులు చేసి కౌలుకు తీసుకున్న పొలంలో భారీగా పెట్టుబడి పెట్టి పంట సాగు చేశారు. పంట చేతికందే సమయంలో కురిసిన వర్షానికి ధాన్యం తడిసిపోయింది. తడిసిన ధాన్యాన్ని కొనే వారు లేక మళ్లీ ఆర్థిక ఇబ్బందులు తప్పవని బాధిత కౌలు రైతులు లబోదిబోమంటున్నారు. పనలపై తడిసిన పంటను ఒబ్బిడి చేసేందుకు పొలాల్లో కల్లాలు బురదమయంగా మారడంతో దూరంగా ఉన్న రహదారులపైకి మోపులతో మోయించి నూర్పిడి చేసేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. దీంతో ఖర్చు కూడా రెట్టింపు అవుతోందని బాధిత రైతులు వాపోతున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ముమ్మరంగా కోతలు

వాతావరణం అనుకూలంగా ఉన్నప్పుడే పంటలను త్వరగా ఒబ్బిడి చేసుకునేందుకు రైతులు ప్రయత్నిస్తున్నారు. దీంతో మండలంలో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎక్కువ మంది రైతులు మెషీన్లతోనే కోయిస్తున్నారు. దీంతో వరి కోత యంత్రాలకు డిమాండ్ పెరిగింది.

రూ.40 వేలు పెట్టుబడి పెట్టాను



మా గ్రామంలో రెండెకరాలు పొలం కౌలుకు తీసుకుని వరి సాగు చేశారు. ఇప్పటివరకూ రూ.40 వేలకు పైగా పెట్టుబడి పెట్టాను. వాతావరణం ఆరుదలగా ఉందని పంటను కూలీలతో కోయించాను. ఒక్కసారిగా వాతావరణం మారింది. తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు పంట మొత్తం తడిసిపోయింది. తడిసిన ధాన్యాన్ని కొనకపోతే నష్టపోతాను. మమ్మల్ని ప్రభుత్వమే ఆదుకోవాలి.

– చిత్రా సుబ్రహ్మణ్యం, కౌలు రైతు, ఎ.కొత్తపల్లి, తొండంగి మండలం.

వరివడిగా కోతలు

- అనుకూలంగా వాతావరణం
- జోరుగా పంట ఒబ్బిడి పనులు
- 21 వేల హెక్టార్లల్లో వరి సాగు

ఏలేశ్వరం: నియోజకవర్గ వ్యాప్తంగా ఖరీఫ్ వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. గత కొద్ది రోజులుగా వాతావరణం అనుకూలించడంతో రైతులు కోతలను ప్రారంభించారు. ఇటీవల ఫెంగల్ తుపాను కారణంగా వర్షాలు కురవడంతో రైతులు కోతలను నిలిపివేశారు. ప్రస్తుతం వాతావరణం తెరిపివ్వడంతో వరికోతలు వేగవంతం చేశారు.

నియోజకవర్గంలో సాగు వివరాలు

ఈ ఏడాది నియోజకవర్గవ్యాప్తంగా 21 వేల హెక్టార్లల్లో రైతులు ఖరీఫ్ సాగు చేశారు. ఏలేశ్వరం మండలంలో ఖరీఫ్ 5950 ఎకరాల్లో వేయగా పంట కోత దశకు చేరడంతో రైతులు కోతలను ముమ్మరం చేశారు. చెరువులు, బోర్ల వంటి నీటి వసతులు ఉన్న చోట రైతులు సంపత్ స్వర్ణ, స్వర్ణ, ఆర్‌జేఎల్ 2538 రకాలు సాగు చేశారు. మండలంలోని ఏలేశ్వరం, లింగంపర్తి, భద్రవరం, సిరిపురం తదితర గ్రామాల్లో కూలీల కొరత ఎక్కువగా ఉండడంతో రైతులు యంత్రాలపై ఆధారపడుతున్నారు. కూలీల కొరతతో పాటు కూలీధరలు ఎక్కువగా ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.


తిరుమాలిలో వరికోత కోస్తున్న కూలీలు

1400 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు

మండలంలో ఇప్పటివరకు 1400 క్వింటాళ్ల ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేశారు. కోతల నుంచి నూర్పుల వరకు యంత్రాలు వేగంగా చేయడంతో పాటు ఖర్చు తక్కువగా ఉండడంతో రైతులు వాటి వైపు మొగ్గు చూపుతున్నారు. గతంలో ఈ ప్రాంత రైతులు ఎక్కువగా యంత్రాలపై ఆసక్తి చూపేవారుకాదు. ప్రస్తుతం మెషీన్లతోనే ఎక్కువగా కోతలు కోయిస్తున్నారు.


లింగంపర్తిలో మెషీన్‌తో వరికోతలు

ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మించాలని వినతి


ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకు వినతిపత్రం అందిస్తున్న ఆయిల్‌పామ్ రైతులు

ప్రత్తిపాడు: మెట్టప్రాంతలో ప్రత్తిపాడు కేంద్రంగా ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మించాలని రైతులు కోరారు. ఈ మేరకు ఆదివారం ప్రత్తిపాడులో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభను కలిసి వినతిపత్రం అందజేశారు. ఫ్యాక్టరీ ఏర్పాటు విషయం సీఎం దృష్టికి తీసుకువెళతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కాగా కిర్లంపూడి, ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాల్లో సుమారు 10,200 ఎకరాల్లో రైతులు ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారు. వీటి నుంచి వచ్చే సుమారు 25 వేల టన్నుల దిగుబడిని ఇప్పటి వరకు ఏలూరు జిల్లా పెదవేగి ఏపీ కో ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ ఫెడరేషన్ లిమిటెడ్ ఫ్యాక్టరీకి పంపుతున్నారు. ఈ ఏడాది మరికొంత మంది రైతులు ఆయిల్‌పామ్ సాగు చేపట్టడంతో మరో ఐదు వేల టన్నుల దిగుబడి వస్తుందని రైతులు చెప్పారు. ఈ ప్రాంతంలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెరగడం వల్ల రైతులకు అందుబాటులో ఫ్యాక్టరీ నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు రాసంశెట్టి రాజా, ఇందన ఏసుబాబు, మాజీ మండల ఉపాధ్యక్షుడు బొల్లు కొండబాబు, రెడ్డి అమర్‌నాథ్, గోగుల బుజ్జి, డి.ఫకీర్‌రాజు, చెక్కపల్లి బూరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగబద్ధమే

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు శ్యాంబాబు

తుని: ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగబద్ధమేనని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కొండేపూడి శ్యాంబాబు అన్నారు. స్థానిక వీరవరపుపేటలో ఆదివారం ఎంఆర్పీఎస్ మహిళా అధ్యక్షురాలు తుమ్మలపల్లి జ్యోతి ఆధ్వర్యంలో మాదిగల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యాంబాబు మాట్లాడుతూ ఎస్సీల్లో కొంతమంది వర్గీకరణను వ్యతిరేకిస్తూ మందకృష్ణ మాదిగపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మందకృష్ణపై అవాకులు, చవాకులు ప్రేలేవారు వర్గీకరణ ఎందుకు వద్దో చెప్పాలని డిమాండు చేశారు. దేశ ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు తప్పంటూ అర్థరహితంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఇది సరైన పద్ధతి కాదని హితవు పలికారు. అనంతరం మాదిగ పోరాట రక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆరుగుల మోషే, పెదపూడి గవరయ్య, డొక్కా అజయ్‌బాబు, తుమ్మలపల్లి కుమార్ తదితరులు శ్యాంబాబును శాలువా, పూలమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. పలువురు దళిత ప్రతినిధులు పాల్గొన్నారు.


తునిలో శ్యాంబాబును శాలువాతో సత్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు

పొగ మంచుతో మామిడికి ముప్పు

తుని రూరల్: ప్రస్తుతం గ్రామాల్లో ప్రతిరోజూ ఉదయం పొగమంచు కురుస్తోంది. పొగమంచు ప్రభావం ఎక్కువగా ఉంటే మామిడి పంటకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఉద్యాన అధికారి జి.విజయలక్ష్మి అన్నారు. తుని, తొండంగి మండలాల్లో ఆదివారం ఆమె పర్యటించారు. రైతులతో కలసి మామిడి తోటలను పరిశీలించారు. పొగమంచు అధికంగా పడుతున్నందున మామిడిని ఆశించే చీడపీడల నివారణకు చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. సస్యరక్షణతో పొగమంచు ముప్పును సమర్థవంతంగా నివారించవచ్చన్నారు.

ఆశించే చీడపీడలు, నివారణ

పొగమంచు కారణంగా ప్రస్తుతం మామిడికి తేనె మంచు పురుగు, మొగ్గ తొలుచు పురుగులు, పక్షి కన్ను తెగులు, బూడిద తెగులు, మసి తెగులు సోకే అవకాశం ఉందన్నారు. ఆయా తెగుళ్ల నివారణకు క్లోరిఫైరీపాస్ 50 ఈసీ ఒక మిల్లీ లీటరు లేదా లాన్సుసైహలోత్రిక్ ఒక మిల్లీ లీటరు లేదా స్పైనోటోరం ఒక మిల్లీ లీటరు, క్లోరోథలోనిత్ రెండు మిల్లీ లీటర్లు గాని నల్ల గంధం మూడు గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేస్తే మంచి ఫలితం లభిస్తుందన్నారు. రైతులు క్షేత్రస్థాయిలో అధికారులను సంప్రదించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.


తొండంగి మండలం పి.ఈ.చిన్నయ్యపాలెంలో మామిడి తోటలను పరిశీలిస్తున్న హెచ్‌ఓ విజయలక్ష్మి

రైతులపై ఆంక్షలు హేయమైన చర్య

గోకవరం: కనీస మద్దతు ధరకు కేంద్రం చట్టబద్ధత కల్పించాలని పోరాడుతున్న రైతులపై నిర్బంధ ఆంక్షలు విధించడం హేయమైన చర్య అని ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. మండలంలోని రంపయర్రంపాలెంలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటూ శాంతియుతంగా ఢిల్లీకి పాదయాత్ర చేస్తున్న రైతులను నిర్బంధించడం దారుణమన్నారు. బలప్రయోగం ద్వారా ఉద్యమాన్ని అణిచివేయాలనే ఆలోచనలను మానుకొని, రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలన్నారు. 2020 విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని, 2013 భూసేకరణ చట్టాని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వల్లూరి రాజబాబు, కుంచె అంజిబాబు, శ్రీకాంత్, డి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.


రంపయర్రంపాలెంలో ర్యాలీ చేస్తున్న రైతు కూలీ సంఘం నేతలు

వైభవంగా శ్రీపుష్పయాగం


అన్నవరంలో స్వామి, అమ్మవార్లకు శ్రీపుష్పయాగం నిర్వహిస్తున్న పండితులు


శ్రీపుష్పయాగాన్ని తిలకిస్తున్న భక్తులు

అన్నవరం: స్థానిక దేవస్థానం హైస్కూల్ వద్ద వేంచేసిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న షష్ఠి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామి, అమ్మవార్లకు శ్రీపుష్పయాగం నిర్వహించారు. రాత్రి 7.30 గంటలకు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి సర్వాంగసుందరంగా అలంకరించిన ఉయ్యాల మీద శ్రీపుష్పయాగం నిర్వహించారు. తొమ్మిది రకాల పిండివంటలను స్వామి, అమ్మవార్లకు నివేదించారు. పండితుల దంపతులకు తాంబూలాలను అందజేశారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. పండితులు ఇంద్రగంటి నర్సింహమూర్తి, వేంకటేశ్వర్లు, దేవులపల్లి ప్రసాద్, సు.దీర్, శర్మ, పవన్, స్పెషల్‌గ్రేడ్ వ్రతపురోహితుడు చామర్తి కన్నబాబు, పురోహితులు పాలంకి పట్టాభి, చల్లపిల్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గౌరీశంకరులకు ప్రత్యేక పూజలు


ఏలేశ్వరంలో స్థానికులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేత మురళీకృష్ణంరాజు

ఏలేశ్వరం: పట్టణంలో గౌరీశంకరుల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కాగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నేత ముదునూరి మురళీకృష్ణంరాజు ఆదివారం స్థానిక నెయిలిపేటలో గౌరీశంకరులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌరీశంకరుల ఉత్సవాలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తూమురౌతు సత్యనారాయణ, జోగా వెంకటరమణ, గణపతి, తదితరులు పాల్గొన్నారు.

గిరిబాబు నాయకత్వంలో పార్టీ బలోపేతం


కిర్లంపూడిలో ముద్రగడ పద్మనాభం, గిరిబాబును కలసిన ప్రజాప్రతినిధులు, నాయకులు

కిర్లంపూడి: వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు నాయకత్వంతో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ప్రత్తిపాడు ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ అన్నారు. కిర్లంపూడిలోని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం నివాసానికి ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. ముద్రగడను, యువ నాయకుడు గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు సీంద్రపు భాస్కరరావు, సాధనాల అప్పారావు, అమరాది కాశీవిశ్వనాథం, మొల్లి వీరబాబు, తట్టవర్తి రామన్నదొర, సర్పంచులు బోండు రాంబాబు, గొణగాల అప్పలరాజు, స్థానిక నేతలు పినిశెట్టి ప్రకాష్, వాకపల్లి శ్రీను, వీరాంజనేయులు, తాతపూడి బుజ్జి, మూరా గంగబాబు తదితరులు పాల్గొన్నారు.

విజయప్రకాష్‌కు అభినందనలు


రత్నగిరిపై విజయ్‌ప్రకాష్‌కు ప్రశంసా పత్రం అందజేస్తున్న ఈఈ రామకృష్ణ

అన్నవరం: కార్తిక మాసంలోని ముఖ్య పర్వదినాల్లో భక్తులకు బస్సు సౌకర్యం కల్పించిన శ్రీప్రకాష్ విద్యా సంస్థల అధినేత విజయప్రకాష్‌ను అన్నవరం దేవస్థానం అధికారులు ఆదివారం అభినందించారు. సత్యగిరిపై హరిహర సదన్ నుంచి రత్నగిరిపై పడమటి రాజగోపురం వరకూ భక్తులకు ఉచితంగా తమ సంస్థ బస్సుల ద్వారా రవాణా సౌకర్యం ఏర్పాటు చేశారు. దీంతో దేవస్థానం కార్యనిర్వహక ఇంజినీర్ వి.రామకృష్ణ విజయ్‌ప్రకాష్‌కు స్వామివారి శేషవస్త్రం, ప్రశంసాపత్రం, ప్రసాదం అందజేసి అభినందనలు తెలిపారు.

పోస్టుకార్డులతో కార్మికుల నిరసన


చిన్నింపేట జీడిపిక్కల ఫ్యాక్టరీ వద్ద చంద్రబాబుకు రాసిన లేఖలతో నిరసన తెలుపుతున్న కార్మికులు

ఏలేశ్వరం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు పోస్టు కార్డులు రాసి ఆదివారం కార్మికులు నిరసన తెలిపారు. మండలంలోని చిన్నింపేట జీడిపిక్కల ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికుల కొన్నిరోజులుగా చేస్తున్న ఆందోళనలు కొనసాతున్నాయి. కాగా ఆదివారం సీఎం చంద్రబాబుకు కార్మికులు లేఖలు రాస్తూ ఫ్యాక్టరీ మెయిన్‌గేట్ వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫ్యాక్టరీ మూసివేతతో 409 మంది కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. యాజమాన్యం తమకు న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వం మూసివేసిన ఫ్యాక్టరీని వెంటనే తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు వీరబాబు, చక్రధర్, గోవిందు, ధర్మాజీ, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే విద్యుత్ వెలుగులు

ఏలేశ్వరం: విద్యుత్‌ను ఆదా చేయాలంటూ అధికారులు చేస్తున్న ప్రచారం ప్రకటనలకే పరిమితమవుతోంది. రాత్రివేళల్లో వెలగాల్సిన వీధిదీపాలు పట్టపగలే వెలుగుతున్నాయి. పట్టణంలోని దిబ్బలపాలెం, సువ్వయ్యపేట, సాయినగర్, షిర్డీనగర్‌లలో గతకొన్ని రోజులుగా వీధిదీపాలు నిరంతరం వెలుగుతున్నాయి. దీనిపై ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో సభ్యులు చర్చించినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


ఏలేశ్వరం షిర్డీ నగర్‌లో పగలు వెలుగుతున్న వీధిలైట్